# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

October - 2000

## సంక్షిప్త వార్తలు

2000 సెప్టెంబరు 29వ తేదీ శుక్రవారం తెల్లవారు జామున నిజామాబాద్ క్రీస్తు సంఘ సువార్తికులు యన్. టైటస్ గారు ప్రభువునందు నిద్రించిరని తెలియజేయుటకు చింతించుచున్నాము. గుండెపోటుతో కొన్ని దినాలు ఆసుపత్రిలో యుండి ఆయన చివరకు ప్రభువు సన్నిధికి చేరుకొన్నారు. టైటస్ గారు నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలలోను, మహారాష్ట్ర లోను క్రీస్తు కొరకు గొప్ప పనిచేసారు. ఆయన విడిచి వెళ్లిన కుటుంబము కొరకు, సంఘముల కొరకు ప్రార్థించమనవి.

2000 సెప్టెంబరు 22వ తేదీ శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం మండలం, కందరాడ గ్రామములో సువార్తికుల సదస్సు ఘనముగా జరిగెను. ఆ సదస్సుకు హర్షల్ బియర్డెన్ మరియు రేండల్ హేగ్‌వుడ్ గార్లు ముఖ్య అతిధులుగా ఆహ్వానించబడిరి.

కందరాడ గ్రామములో సోదరులు రోయస్ ఫ్రెడరిక్‌గారి సహాయ సహకారముల వలన జాషువాగూటం క్రీస్తుసంఘఆలయమును నిర్మించిరి. స్థానిక సంఘస్థుల సహాయముతో ఆ ఆలయము చక్కగా నిర్మించబడినది. దానిని సెప్టెంబరు 22వ తేదీ శుక్రవారంనాడు పైనుదహరించిన ఇద్దరు అమెరికా సోదరులు, జాషువాగూటంగారు, టి.వి.యన్. కుమార్‌గార్లు రిబ్బను కత్తిరించి, ప్రార్థనలుచేసి ప్రభువుసేవనిమిత్తం ప్రతిష్టించిరి. తదుపరి సువార్తికులసదస్సు నూతన ఆలయములో జరిపించబడెను.

సదస్సుకు జాషువాగూటంగారు అధ్యక్షత వహించి చక్కగా నిర్వర్తించిరి. సోదరులు రాజారెడ్డిగారు పాటలు నడిపించుటలో సహాయ పడిరి. తదుపరి కందరాడ స్థానిక సువార్తికుడు ప్రకాశరెడ్డిగారు ఆలయ నిర్మాణమును గూర్చిన వివరణయిచ్చిరి. ఆలయ నిర్మాణములో జాషువా గూటంగారు యిచ్చిన చేయూతకు, నడిపింపుకు కృతజ్ఞతలు తెలియజేసిరి.

మొదటిగా హర్షల్ బియర్డెన్ గారు 1వ కొరింథీ. 3:11ను బట్టి వాక్యోపదేశము చేసిరి. క్రీస్తుసంఘమునకు పునాది క్రీస్తే, శిరస్సు క్రీస్తే, రక్షకుడు క్రీస్తేయనియు క్రీస్తు అను పునాదిమీద నిర్మించబడిన సంఘము అత్యంతబలమైనదని, ఆయనపైన అందరూ తమ ఆత్మీయజీవితమును

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 363722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 21 | అక్టోబరు 2000 | సంచిక 3


## బైబిలును ఎందుకు చదవాలి?-2

( Why Study the Bible ? - 2)

బైబిలు గ్రంధముయొక్క విశిష్టతను గూర్చి, దానిని చదువవలసిన అవసరతను గూర్చి గతపాఠంలో మనం కొంత నేర్చుకొనియున్నాము. అది దేవుని వలన కలిగిన గ్రంధమని తనను గూర్చి బైబిలు చెప్పుకొనుచున్నది. దేవుడెట్లు పరిపూర్ణుడో అట్లే బైబిలు కూడ పరిపూర్ణమైనది. దేవుడు పరిశుద్ధుడు. అందువలన బైబిలు పరిశుద్ధమైన ఉన్నత ఆదర్శములను మానవులకు బోధించుచున్నది. తరువాత బైబిలు దైవకృతము గనుక దానిలాంటి గ్రంధమును నేటికింకా మానవులు లిఖించలేకపోయారని గత పాఠంలో మనం నేర్చుకొనియున్నాము.

ఐదవదిగా, దేవుడు నిత్యుడు. యుగయుగములకు ఆయనే దేవుడు. "ప్రభువా తరతరములనుండి మాకు నివాసస్థలము నీవే. పర్వతములు పుట్టక మునుపు, భూమిని, లోకమును నీవు పుట్టింపకమునుపు యుగయుగములు నీవే

దేవుడవు" అని కీర్తన 90:1,2లో చెప్పబడియున్నది. అట్లయినప్పుడు ఆయన వాక్యము కూడ నిత్యము నిలుచునట్టిదైయుండాలి. బైబిలు విషయంలో యిది సత్యం. గొప్పవిద్యావేత్తలు, వేదాంతులు, శాస్త్రవేత్తలు ఎన్నో గ్రంధాలు వ్రాసారు. కాలాన్ని బట్టి అవి రోజురోజుకు మారిపోతున్నాయి. కొన్ని గ్రంధాలు కనబడకుండా పోతున్నాయి. అయితే బైబిలు యుగములు తరబడినను తాజాగానే యున్నది. ఎప్పుడు చదివినను క్రొత్తగానే యుంటాది. 20శతాబ్దముల పాతదైన బైబిలు గ్రంధం ఈ 21వ శతాబ్దములో కూడ మిగతా గ్రంధములన్నింటికంటే ఎక్కువ అమ్ముడగుచున్నదంటే, అది దేవుని వాక్యమని గాక మరింకేమవుతాదని మనం అనుకోగలం ?

ఆరవదిగా, బైబిలు దేవునినుండి కలిగినట్లయితే మానవుని తత్వాన్ని అదియదార్ధంగా చిత్రీకరించియుండాలి. బైబిలు అట్లే చేయుచున్నది. మానవుడు దేవుని స్వరూపమున (ఆది. 1:26), యదార్ధవంతుడుగా (ప్రసంగి. 7:29) సృజింపబడినను పాపము చేయుటవలన అతడు దేవునినుండి దూరము చేయ బడ్డాడు అని బైబిలు బోధించుచున్నది. "దేవుడు నరులను యదార్ధవంతులుగా పుట్టించెను గాని వారు వివిధమైన తంత్రములు కల్పించుకొనియున్నారు" (ప్రసంగి. 7:29). "రక్షింపనేరకయుండునట్లు యెహోవా హస్తము కురుచకాలేదు. విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు. మీదోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను" అని అది బోధించుచున్నది (యెషయా. 59:1-2).

ఏడవదిగా, బైబిలు దేవుని నుండి కలిగిన గ్రంధమైతే మానవుని గూర్చిన వేదాంతమును గాక అతని జీవనగమ్యాన్ని గూర్చిన ఖచ్చితమైన సమాచారం అందులోయుండాలి. నేనెవరిని? ఎక్కడినుండి వచ్చాను? ఎక్కడికి వెళ్ళుచున్నాను? అని మానవుడు ఆలోచిస్తూయుంటాడు. ఈ ప్రశ్నలకు నిర్దిష్టమైన జవాబును బైబిలు యిచ్చుచున్నది. గనుక దానిని ప్రతి మానవుడు చదువుట అత్యవసరం.

మానవుడు పరిశోధక బుద్ధి కలవాడు. అతడు కోతిలోనుండి గాక దేవుని చేతిలో నుండి సృజింపబడిన వాడని బైబిలు బోధించుచున్నది. నేల మంటితో అతని శరీరం చేయబడినను, తనలో దేవుని జీవాత్మయున్నదని బైబిలు బోధించు చున్నది. అందువలన మానవుడు చనిపోగా, "మన్నయినది వెనుకటి వలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు మరలపోవును" అని అది చెప్పుచున్నది (ప్రసంగి. 12:7).

మానవుడు నిష్ప్రయోజకుడుగా నుండుటకు భూమిమీద సృజింపబడలేదు. మనము దేవుని మహిమ నిమిత్తమము సృజింపబడిన వారమని బైబిలు బోధించు చున్నది (యెషయా. 43:7). జ్ఞానియైన సొలోమోను యిట్లు చెప్పాడు. "ఇదంతయు వినిన తరువాత తేలిన ఫలితార్థమిదే. దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడలననుసరించి నడుచుచుండవలెను; మానవకోటికి ఇదియే విధి" (ప్రసంగి. 12:13). మానవుడు దేవునిచే సృజింపబడినవాడు. దేవుని సేవించి ఆయనకు లోబడియుండవలసిన విధి అతనికున్నది. భూమిమీద అతడు జీవించిన విధానాన్నిబట్టి దేవుడు అతనికి తీర్పు తీర్చును. "గూఢమైన ప్రతియంశమును గూర్చి దేవుడు విమర్శచేయునప్పుడు ఆయన ప్రతిక్రియను అది మంచిదేగాని, చెడ్డదే గాని తీర్పులోకి తెచ్చును" (ప్రసంగి. 12:14).

దేవుడు పరిశుద్ధుడు, పాపమునకు దూరముగా వున్నవాడు. మానవుడు పాపములో పడకుండా అతని నిరోధించుటకు దేవునివాక్యమైన పరిశుద్ధ గ్రంథము అతనికి సహాయము చేయును. "యౌవనస్థులు దేనిచేత తమ నడత శుద్ధిపరచు కొందురు? నీవాక్యమును బట్టి దానిని జాగ్రత్తగ చూచుకొనుటచేతనే గదా?" "నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొనియున్నాను, యెహోవా, నీవే స్తోత్రము నొందదగినవాడవు" అని కీర్తనలు 119:9-11లో వ్రాయబడియున్నది. దేవుని ధర్మశాస్త్రము తమ హృదయములోనున్న వారి అడుగులు జారవు అని బైబిలులో బోధించుచున్నది (కీర్తన. 37:31).

నిష్ప్రయోజకుడైన మానవుడెవడు సంతోషంగా జీవించలేడు. ఒక గమ్యం, ప్రయోజనం లేని మానవుడు నిజానికి దుర్భాగ్యుడు. అయితే నిష్ప్రయోజకునిగా మానవుడు సృజింపబడలేదని బైబిలు బోధించుచున్నది. మానవుడు నిత్యత్వం కొరకు సృజింపబడ్డాడు. నిజదేవుని సేవించుటలోనే అతని జీవితం ధన్యమగును అని మనం యిదివరకే గమనించాము.

గొప్ప శోధనలతోను బాధలతోను నిండియున్న లోకంలో మనం జీవించు చున్నాము. రోగములు, బాధలు మరణం ఇక్కడ యున్నవి. గొప్ప దుఃఖము ఇక్కడ యున్నది. దేవునికి వ్యతిరేకముగా పాపము చేసినందున మనం అనేక కీడులకు లోనగుచున్నాము. "మనుష్యులందరు పాపము చేసినందువలన మరణము అందరికి సంప్రాప్తమాయెను" (రోమా 5:12) మానవుడు ఎంత ప్రయత్నించినను పరిపూర్ణుడు కాజాలేకపోవుచున్నాడు. అందువలన ఈలోకంలో మనం యాత్రికులమే, పరదేశులమే (1పేతురు 2:11; హెబ్రీ 11:16). అయితే పరిశుద్ధ లేఖనములను చదువుట వలన మనకు గొప్ప ఆదరణ, నిరీక్షణ కలుగును. "ఏలయనగా ఓర్పువలనను, లేఖనములవలని ఆదరణ వలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడినవన్నియు మనకు బోధ కలుగు నిమిత్తము వ్రాయబడియున్నవి" (రోమా 15:4). దేవుని వాక్యమైన బైబిలును చదువుట ద్వారా లెక్కలేనంతమంది గొప్ప ఆదరణ పొందుచున్నారు.

బైబిలులో దావీదు వ్రాసిన 23వ కీర్తన గొప్ప ఆదరణ కీర్తనయై యున్నది. "యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు. పచ్చికగల చోట్లను ఆయన నన్ను పరుండ జేయుచున్నాడు. శాంతికరమైన జలముల యొద్ద నన్ను నడిపించు చున్నాడు. నా ప్రాణమునకు ఆయన సేద దీర్చుచున్నాడు. తన నామమును బట్టి నీతి మార్గములలో నన్ను నడిపించుచున్నాడు. గాఢాంధ కారపులోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను. నీవు నాకు తోడైయుందువు. నీ దుడ్డుకర్రయు నీ దండమును నన్ను ఆదరించును. నా శత్రువుల యెదుట

నీవు నాకు భోజనము సిద్ధపరచుదువు. నూనెతో నాతల అంటియున్నావు. నా గిన్నె నిండిపొర్లుచున్నది. నేను బ్రతుకు దినములన్నియు కృపాక్షేమములే నావెంట వచ్చును. చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను" (దా. కీర్తన 23). ఈ లోకంలో జీవించిన అతిశ్రేష్టమైన వ్యక్తిని గూర్చి, యేసుప్రభువును గూర్చి బైబిలు మనకు బోధించుచున్నది. గనుక దానిని మనం చదవాలి. మొదట స్త్రీ పురుషులు, ఆదాము హవ్వలు పాపము చేయగా దేవుడు వారికొక రక్షకుని వాగ్దానం చేసారు. పాపము చేయుటకు వారిని శోధించిన అపవాదితో దేవుడు, "మరియు నీకును స్త్రీకిని నీ సంతానమునకును ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను. అదినిన్ను తలమీద కొట్టును; నీవు దానిని మడిమమీద కొట్టుదువని చెప్పెను" (ఆది. కా. 3:15). ఇక్కడ వాగ్ధానము చేయబడిన స్త్రీ సంతానమే యేసుక్రీస్తు (గలతీ. 4:4).

యేసుక్రీస్తును గూర్చిన వాస్తవములు ఈ లోకం అంతటిలో నిండియున్నవి. పురాతన యూదా, గ్రీకు, రోమన్ చరిత్రపుటల నుండి క్రీస్తు యొక్క జీవితచరిత్ర మనం తెలిసికొనవచ్చును. అయితే క్రీస్తును గూర్చిన శ్రేష్టమైన సమాచారము మనకు క్రొత్తనిబంధనలో యున్నది. ఆయన జననము, జీవితము, చేసిన బోధలు, అద్భుతములు, ఆయన మరణం, పునరుత్థానమువగయిరాలన్నీ క్రొత్తనిబంధన చదువుట ద్వారా మనం గ్రహించుకొనగలము. క్రీస్తు లేకుండా మానవుడెవడు దేవునితో సహవాసము కలిగియుండలేడు. "నేనే మార్గమును, సత్యమును, జీవమును. నాద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" అని యేసుప్రభువు చెప్పెను (యోహాను. 14:6). బైబిలును చదువకపోతే, దాని వర్తమానము వినకపోతే మనం యేసుక్రీస్తును గూర్చి తెలిసికొనలేము.

"మనము ఆయన ఆజ్ఞలను గైకొనినయెడల, దీనివలననే ఆయనను ఎరిగియున్నామని తెలిసికొందుము" (1యోహాను 2:3). యేసుప్రభువు నందు విశ్వాసముంచుము. ఆయనే నిజమైన దేవుని కుమారుడని, రక్షకుడని నమ్ముము.

నీ పాపములవిషయమై మారుమనస్సు పొందుము. ఆయనయందలి విశ్వాసాన్ని మనుష్యుల యెదుట ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందుము. ఆయన నిన్ను రక్షించి తన సంఘముతో చేర్చుకొంటారు. తదుపరి దినదినం ఆయన వాక్యాన్ని చదువుము, నేర్చుకొనుచు మరణపర్యంతము ఆయనకు నమ్మకముగా జీవించు. నిత్యజీవకిరీటాన్ని ఆయన నీకు ప్రసాదిస్తారు.

— 0 —

## క్రీస్తును కొట్టిన వారెవరు?

(Who is he that struck Christ)

కొందరు ఆయనను అరచేతులతో కొట్టి 'క్రీస్తూ నిన్ను కొట్టినవాడెవడో ప్రవచింపుమనిరి' (మత్తయి. 26:68).

వైద్యపరీక్ష నిమిత్తము డాక్టరునొద్దకు వెళ్ళడం పరిపాటి. పరీక్షలోఒక భాగంగా వైద్యుడు మన చేతులను వ్రేళ్ళను, గోళ్ళను పరిశీలించి రోగనిర్ధారణచేయగలడు.

యేసు ప్రభువును కొట్టినచేతులను ఒకసారి పరిశీలన చేయుదము. వారు ఆయన ముఖముమీద ఉమ్మివేసి గుద్దిరి (మత్తయి. 26:67). యిట్టి దుష్టకార్యముల వెనుక వారి భయంకర మానసిక స్థితి ప్రతిబింభిస్తుంది. వారి ఆత్మీయస్థితి ఎలాంటిదో పరిశీలించేటప్పుడు అనుకోని విధంగా భీతి మనలో ఆవరించి మన చేతులను మనమే చూచుకుంటాము. ఒకవేళ మనమును అట్టి భయంకరస్థితిలో నిగూఢమైన ఆధ్యాత్మిక రుగ్మతలతో బాధనొందుచున్నామేమో?

"క్రీస్తూ నిన్ను కొట్టినవాడెవడో ప్రవచించు"మను మాటలు అపహాస్యములైయున్నవి. రోమా సైనికులు హేళనతో అడిగిన ప్రశ్న యిది. వారి ప్రశ్నకు యేసు జవాబునిచ్చియుండవలసిందని మానవతలంపు. ఆ జవాభేమిటో మన మస్తిష్కంలో

మెదులుతుంది. రోమా సైనికులు అపహాస్యము చేస్తున్నది "నిజమగు దేవుని కుమారుడినని" గ్రహించలేకపోయారు. దేవుని కన్నులు యేసుక్రీస్తు ద్వారా సమస్తమును చక్కగా చూడగలవని వారు గుర్తించకయున్నారు.

## ఆయన సమస్తమును ఎరిగిన వాడు

దేవస్వభావంలో యేసుక్రీస్తు, సర్వాంతరాళమును ప్రత్యక్షంగా ఎరిగి యున్నాడు. ఆకాశాన్ని, భూమినీ, నదీనగములను, చరాచరములను, ధరిత్రిలో చిమ్మచీకటి, ప్రకాశవంతమైన వెలుగు, నిక్షిప్తనిధులు, అంధకారమందలి రహస్యములు ఒకటేమిటి ? ఆయన దృష్టికి మరుగైనదేదియులేదు. ఆయన అందరిని అన్నిటిని ఎరిగినవాడు. రోమా సైనికులు ఉమ్మివేసి దుర్భావముతో అరచేతులతో కొట్టి, ఎగతాళిచేస్తూ, క్రీస్తూ, నిన్ను కొట్టినవాడెవడో చెప్పమన్నంత మాత్రాన ఆయన చెప్పలేకకాదు. అక్కడున్న సైనికుల పేర్లు పుట్టుపూర్వోత్తరాలు, గోత్రాల చిరునామాలతో సహా చెప్పగలడు. అలా చెప్పియుండినను వారు ఆయనను దయ్యము పట్టినవాడని అనియేయుందురు. బహిరంగసువార్త పరిచర్యలో మూడు సంవత్సరాలు ప్రసంగిస్తూప్రవచించిన క్రీస్తు, ప్రవచనముత్యాలను పందులయెదుట చల్లుట నిష్ప్రయోజనమని తలంచి వారి ప్రశ్నలకు ఆయన జవాబునియ్యకుండెనని నేను తలంచుచున్నాను.

నతనయేలును గూర్చి మంచి సాక్ష్యము పలికిన నజరేయుడగు యేసుక్రీస్తు మాటలు ఆశ్చర్యకరములుగ దోచును (యోహాను. 1:47-48). అంజూరపు చెట్టుక్రింద ఉన్నప్పుడే చూచినవాడు తన్ను కొట్టినవాడెవడో చెప్పగలేని అసమర్థుడు మాత్రం కాడు. అయితే ప్రశ్న వేసినవాడే జవాబును కూడ చెప్పుకొనేస్థితిని ఆయన కలిగించును. ఇస్కరియోతుయూదాకు అదే జరిగెను (మత్తయి. 26:25). ఆదామునుండి ప్రజలందరును వారి పాపములచేత ఆయన ముఖమును మొత్తుచునేయున్నారు.

ఆదాము దేవునితో ముఖాముఖి మాట్లాడి జీవించినవాడే. ఆజ్ఞాతిక్రమంచే ముఖం త్రిప్పుకుని దేవుని చూడలేకదాగుకొన్నాడు. కయీను పగతోను, ఈర్ష్యతోను తన ముఖం నింపుకున్నాడు. స్వంతసహోదరుని చంపుకున్నాడు. దోషశిక్షగా దేశ దిమ్మరియైనాడు. ఇశ్రాయేలు చరిత్రలో యిట్లాంటి అనుభవాలు పునరావృత మయ్యాయి. అవిధేయత, సణుగుడు, విగ్రహపూజ, అసత్య ఆరాధనలతో నన్ను నాతండ్రిని కొట్టుచునేయున్నారని యేసు చెప్పుచున్నారు (యోహాను. 10:32-33; మత్తయి. 23:35-37).

నేడుకూడ క్రీస్తూ నిన్ను కొట్టినవాడెవడు? అని ప్రశ్నించువారున్నారు. వీరిని గూర్చి మనం దినపత్రికలలో చదువుచున్నాము. రేడియో, టి.వి ప్రసారసాధనాలలో శ్రవణ, దృశ్యములరీతిలో తెలిసికొనుచున్నాము. వారు కసాయితత్వం ప్రదర్శించు చుండిన రోమా సైనికులకన్నా భయంకరులే సుమా! ఆలోచించుము.

పాఠశాలలో ఒక విద్యార్థి మరో విద్యార్థి ముక్కుమీద బలంగా కొట్టిననందున రక్తం కార్చుకుంటూ వెళ్ళిపోతాడు. కాలేజీలో ఒకఅమ్మాయిని కొందరు అబ్బాయిలు వెంటాడి ఏడ్పించినందున ఆ అమ్మాయి ఆత్మహత్యకు పాల్పడింది. త్రాగుబోతు భర్త భార్యను, బిడ్డల్ని తిట్టికొడుతుంటే సంసారం విచ్ఛిన్నం అయింది. మోసం, నిర్లక్ష్యము, దొంగతనం, నేరముతో యజమానికి దెబ్బతీస్తున్నాడు నమ్మక ద్రోహియైన పనివాడు. పరిశుద్ధవివాహము ద్వారా గృహస్థుయైన వాడు పరస్త్రీలతో సంబంధం కలిగియుంటున్నాడు. మధ్యపానాసక్తి గల డ్రైవర్ వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి అనేకమందికి ప్రమాదాన్ని తెచ్చిపెడ్తున్నాడు. రాజకీయ కక్షలు, గృహ కలహాలు, కులమత వర్గపోరాటాలు యివన్నీ తోటివాడిని హతమార్చు ప్రయత్నములే. రోమను భటులవలెనే నేడును క్రీస్తుస్వరూపమునకు మార్చ బడుతున్న మానవమాత్రుని కొట్టుచున్నారుగాదా ? ప్రతినిత్యము మనం చేస్తున్న పని యిదేనేమో? పరిశీలించుకొనుటకును , ప్రక్షాళన గావించుకొనుటకును యిది మంచి సమయం కాదా ? మనలను మనమే పరిశీలించుకుని ప్రభువు పాదములపై పడుదము.

# క్రీస్తు ఎందుకు కొట్టబడెను ?

యెషయా 53 వ అధ్యాయంలోని 4-10 వచనములు పరిశీలించండి. అతని నలుగ గొట్టుటకు యెహోవాకు యిష్టమాయెను. తండ్రియైన దేవుడు "న్యాయమూర్తి". సైనికులు దూషించడం, హింసించడం, బాధించడం వంటి కార్యాలు స్తంభింపచేయ గలడు. అయితే జగత్తునందలి మానవ శరీరములు, ముఖములు పాపముతో నిండి పోయినవి. అరికాలు మొదలు తలవరకు పచ్చిపుండ్లు, గాయములతో కంపు కొట్టుచున్నవి. కొన్నాళ్లు పాపమానవజాతినుండి తన ముఖమును త్రిప్పుకుని వారి స్వకార్యాలకు వారిని అప్పగించాడు. అయితే పాపక్షమాపణ లేని వారు ఎన్నటికిన్ని దైవోగ్రతకు పాత్రులే, శిక్షార్హులే! (యెష. 14:15). దయ, కరుణ, జాలి పొంగు చున్నట్లగుపడుచున్నది. న్యాయసంబంధమైన కోపానికీ, మహోన్నతమైన ప్రేమకు యిక్కడ పోరాటములా గోచరిస్తున్నది (ఎఫెసీ. 2:13-16). తండ్రి ముఖములోనికి మనలను ఐక్యపరచుటకు తండ్రిచేత పంపబడిన క్రీస్తుయేసు, భూలోకమందున్న ప్రజలందరికొరకు వారి రక్షణార్థము అనగా మన అందరికొరకు ప్రాణము పెట్టిన పవిత్రకార్యమును బట్టి, దేవుని ప్రేమ సిలువలోనే మనకు ప్రత్యక్షమగుచున్నది (రోమా. 5:8).

ప్రజలందరును యేసుక్రీస్తు సిలువవైపు చూడవలెనని క్రొత్తనిబంధన అభ్యర్థిస్తున్నది. "అరణ్యములో మోషే సర్పమును ఏలాగుఎత్తెనో, ఆలాగే విశ్వసించు ప్రతివాడును నశింపక ఆయనద్వారా నిత్యజీవము పొందునట్లు మనుష్యకుమారుడు ఎత్తబడవలెను" (యోహాను. 3:14-15).

క్రీస్తు శరీరధారియైయున్న దినాలలో చాలామంది ఆయనను సామాన్యుడిగా భావించేవారు. సిలువమరణం భయంకర శ్రమలపర్వం. త్రాగుటకు నీరుకూడలేదు. దేవునిచేత మానవులచేత దూరపరచబడిన స్థితి: లోకపాపమునంతా ఆయన భరించాడు. ముళ్ళకిరీటం, ప్రక్కలోబళ్ళెపుపోటు, కాళ్ళుచేతులలో కరుకుమేకులు,

ఒళ్ళంతా రక్తప్రవాహం, అవమానపుస్థితి, దూషణలు, ప్రతినిమిషం ప్రతిక్షణంవేదన, మరణావస్థ. అబ్బో అదెంత బాధయో.... మానవనైజం ఈవిధంగా ఘోషిస్తున్నది. - నేను నిస్సహాయుడను. వేదనలోఉన్నాను-నీవు క్రీస్తువు గదా? నిన్ను నీవు రక్షించు కొనుము. నన్ను కూడ రక్షించుము (లూక. 23:39). సిలువలోనున్న క్రీస్తును విశ్వాసనేత్రాలతో వీక్షించిన వానికి ఆదరణ దొరికినది. "నీవు నాతోకూడ పరదైసులో ఉందువు" ( లూకా. 23:42-43). అయితే దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తు సిలువ మరణమునొందినపుడు మూడవదినమున సజీవునిగ లేపినాడు, లోకము నకు చూపినాడు.

ఈ కార్యము వలన సమస్తమానవాళికి (యోహాను 3:16) ఆయన ద్వారానే నిత్య జీవము అనుగ్రహించియున్నాడు. తండ్రియైన దేవుని చిత్తానుసారము;. మృతులలోనుండి పునరుత్థానుడైన ప్రభువైన యేసుక్రీస్తు మనలను రక్షించినాడు. ఈయన తన ద్వారా దేవునియొద్దకు వచ్చువారి పక్షమున విజ్ఞాపనచేయుటకు నిరంతరము జీవించుచున్నాడు. సంపూర్ణముగ రక్షించుటకు శక్తిమంతుడై యున్నాడు (హెబ్రీ. 7:25).

యేసుక్రీస్తు మరణపునరుత్థానముల ద్వారా మనకు లభించిన రక్షణ మిక్కిలి అమూల్యమైనది.

ఇప్పుడు క్రీస్తుయేసులోని దేవుని ప్రేమ అనే సువార్త ప్రకటనద్వారా దేవుడు మనలను ఆయన వైపు చూడవలెనని ఆకాక్షించుచున్నాడు. మనము ఆయన తట్టు తిరిగి నట్లయిన ఆయన మనతట్టు తిరుగును (యోహాను. 14:17-20). ఇదెంత గొప్ప ఆదరణయైయున్నది!

రోమాసైనికులు క్రీస్తును ఎరుగకకొట్టిరి. ఆయన దేవుని కుమారుడని వారు అంగీకరించలేదు. కానీ; ఆయన మరణించినపుడు(మార్కు 15:39) పునరుత్థానుడై లేచినపుడు (మత్తయి. 27:54) ఈయన నిజముగ దేవుని కుమారుడేయని

సాక్ష్యమిచ్చిరి. అయినను వారు రక్షింపబడియుండలేదు. పాపమునుండి విడిపించ బడుటకు ఒకడు రక్షింపబడుటకు ఏమి చేయవలెనని బైబిలు బోధించుచున్నది?

"యేసుప్రభువుని నోటితో ఒప్పుకొనవలెను. దేవుడాయనను మృతులలోనుండి లేపెనని హృదయమందు విశ్వసించవలెను" (రోమా. 10:9-10).

విశ్వసించుటయనగా సువార్తను విని, వినినది సత్యమని నమ్ముట. అదియే విశ్వాసము. నమ్మినవారు ఏమి చేయవలెను? ఏమి చేయవలెనో యేసు చెప్పి యుండెను.

"నమ్మి బాప్తిస్మము పొందినవారు రక్షింపబడుదురు" (మార్కు 16:16).

బాప్తిస్మమును గూర్చి అనేక లేఖనవివరణములున్నవి. కానీ; ప్రాముఖ్యమైన భావమును స్ఫురింపచేయునదేమనగా - "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడినవారై, ఆయనను మృతులలోనుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా, ఆయనతో కూడ లేచితిరి" (కొలస్స. 2:12). మనము నూతన జీవము పొందినవారమై నడచుకొనునట్లు మనము బాప్తిస్మము వలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి (రోమా. 6:4). బాప్తిస్మము ఒక ఆచారముకాదు గానీ, అదియొక అద్భుతసంఘటనయై రక్షణ పొందగోరు వారికి దేవుని సంకల్పమైయున్నది. ఆయన మరణముయొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగలవారమైన యెడల ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యము గలవారమైయుందుము (రోమా. 6:5). క్రీస్తుతో జీవించిపాలించే ధన్యతనుండి దిగజారకుండ జాగ్రత్తపడుదము.

- సామ్యూల్ జాన్, మేడిది.
క్రీస్తు సంఘము, కొణితివాడ.

# మతశాఖల బోధలకును, బైబిలు బోధకును గల వ్యత్యాసములు

## (Differences between Denominational doctrines And the Bible Teachings)

గత రెండు సంచికలలో మతశాఖలవారు కేథలిక్కుల నుండి అరువు తెచ్చుకొనిన అబద్ధబోధలను కొన్నింటిని పరిశీలించాము. సవరణోద్యమము కాలములోను, దాని తరువాతనుద్భవించిన మరికొన్ని అబద్ధబోధలను క్లుప్తముగా ఈ సంచికలో పరిశీలించుదము.

### పది ఆజ్ఞలు ఇప్పటికిని అమలులోయున్నవా ?

మోషే ధర్మశాస్త్రమునకు మనము ఇప్పుడు బద్ధులమైన వారము కామని బైబిలు బోధించుచున్నది. క్రీస్తు సిలువపై చనిపోగానే దానినుండి మనము విడుదల పొందితిమి. మనము ఇప్పుడు క్రీస్తుయొక్క క్రొత్తనిబంధనకు బద్ధులమైయున్నాము. పాతనిబంధన అంతయును ఎత్తివేయబడెను (హెబ్రీ పత్రిక **9,10** అధ్యాయములను ఒకమారు చదవండి).

క్రీ॥శ **1831** తరువాత ఎడ్వంటిస్టు మతశాఖవారు ఉద్భవించి మనము నేటికిని పదియాజ్ఞలకు బద్ధులమై యున్నామనియు, మోషే ధర్మశాస్త్రములో రెండు భాగములున్నవనియు దానిలో సంస్కారసంబంధమైన (చట్టము) ధర్మశాస్త్రము కొట్టివేయబడెను గాని మిగతాదంతా అమలులోయున్నదనియు బోధించుట కారంభించిరి. పదియాజ్ఞలు ఇప్పటికిని అమలులోయున్నవని వారు విశ్వసించుట వలన, మానవులు సబ్బాతునాచరించాలనేది వారి ప్రాధమిక బోధయైయున్నది. వీరు చేసే మరొక వింత బోధయేమంటే, మరణించిన తరువాత మానవుని ఆత్మ నిద్రపోవును, లేక అపస్మారకములోయుండును అని వారు చెబుతారు.

## అయితే మోషే ధర్మశాస్త్రములో నైతికచట్టము సంస్కారచట్టము అను రెండు భాగములున్నాయా?

బైబిలు బోధ :

ఒకే ఒక్క ధర్మశాస్త్రమున్నది. 2 దినవృ. **31:3;** హెబ్రీ. **8:4;** 3:8; మలాకీ. **4:4;** కీర్తన **19:7.**

బైబిలులో 'ధర్మశాస్త్రములు' అని గాక ధర్మశాస్త్రము అని చెప్పబడియున్నది.

యెహోవా నిబంధన మందసము ప్రక్కన ఉంచబడిన "ధర్మశాస్త్ర గ్రంధము"లో పదియాజ్ఞలు రెండుమార్లు వ్రాయబడియున్నవి (ద్వితీ. 31:6; నిర్గమ. 20:1-17; ద్వితీ. 5:6-22).

యెహోవా ధర్మశాస్త్రములో నైతికశాసనములు, సంస్కారశాసనములు కూడ యుండెను (2దిన. 31:3; మత్తయి. 22:36-40).

"మోషే ధర్మశాస్త్రము, యెహోవా ధర్మశాస్త్రము' అను మాటలు లూకా 2:22-24లో ఒకదానికొకటి సరిసమానముగ వినియోగించబడెను. ఇక్కడ తమ్మును తాము శుద్ధిచేసికొను సంస్కారము వివరించబడెను. ఈ రెండు వేర్వేరు గాక ఒకే ధర్మశాస్త్రము.

మోషే ధర్మశాస్త్రము ఎత్తివేయబడెను (హెబ్రీ. 10:8).

మతశాఖల బోధ :

"ఒక ధర్మశాస్త్రము రాతి పలకలమీద వ్రాయబడెను. అది నైతికవిధులను గూర్చి మాత్రమే యుండెను. మరొకటి మోషేచే ఈయబడెను. అది వివిధసంస్కార విధులను గూర్చి వివరించెను" ( Synopsis of present Truth, Page 255).

"నైతిక ప్రవర్తనను గూర్చిన దేవుని చిత్తము ఆయన పదియాజ్ఞల చట్టములో ఇమడ్చబడెను. యివి ప్రతియుగములోను ఉన్న మానవులందరికి వర్తించు గొప్ప నైతిక సూత్రము"

(Stewart, Page 55)

గమనిక : నైతికసూత్రములు వాటికవే పవిత్రమైనవి. అయితే సంస్కారసంగతులు ఆజ్ఞవలన పవిత్రములవుతాయి (మార్కు. 2:23). సబ్బాతును గూర్చిన ఆజ్ఞ సంస్కార (Ceremonial). సంబంధమైనది గాని ఆజ్ఞవలన అది పరిశుద్ధమైనదిగా చేయబడెను (నిర్గమ. 20:8). ధర్మశాస్త్రము అంతయును పూర్తిగా నివారణ చేయబడెను.

## మనము సబ్బాతును ఆచరించాలా?

బైబిలు బోధ :

పాత నిబంధన అంతయును ఎత్తివేయబడెను. కొలస్స. **2:14.** అన్నపానములు, పండుగ, అమావాస్య, విశ్రాంతి దినము అనునవి అన్నీ కొట్టివేయబడెను (హోషేయ. **2:11;** కొలస్స **2:14-17).**

మతశాఖల బోధ :

పదియాజ్ఞలు ఇంకా అమలులోయున్నవి. మానవులు విశ్రాంతిదినము నాచరించాలి.

## మరణము తరువాత ఆత్మ నిద్రించునా ?

బైబిలు బోధ :

దేవుడు మన ఆత్మలకు తండ్రి. యోహాను. 3:16; అపొ. కా. 17:29.

శరీరమువలె ఆత్మ మరణించదు. ప్రసంగి. 3:21; 12:7.

అపొ. కా. 7:59; 2కొరింథీ. 5:1-8

వెడలిపోయిన ఆత్మలు స్మృతి కలిగియుండును.

లూకా. 16:19-21; మత్తయి. 22:32
ప్రకటన. 6:9-11

సమాధిలో శరీరము నిద్రించుచున్నట్లు చెప్పబడెను గాని ఆత్మను గూర్చి అట్లు చెప్పబడలేదు. మత్తయి. 7:52

మతశాఖల బోధ :

"మానవులు మరణములో అపస్మారకస్థితిలో యుందురు. మరణము నుండి పునరుత్థానము వరకు మంచివారేమి, చెడ్డవారేమి అందరు సమాధిలోనే యుందురు" (Stewart, page 56). మొదటి పునరుత్థానములో విశ్వాసులు సజీవు లగుదురనియు, వెయ్యేండ్ల తరువాత రెండవ పునరుత్థానములో దుష్టులు లేప బడుదురు గాని అగ్నిచే వారు నాశనము గావించబడుదురనియు అడ్వెంస్టు వారు నమ్ముదురు.

## పరిశుద్ధాత్మ బాప్తిస్మము

పరిశుద్ధాత్మ బాప్తిస్మము అమలులోయున్నదని విశ్వసించే పలుగుంపుల వారున్నారు. హోలినెస్ గ్రూపువారు, చర్చ్ఆఫ్‌గాడ్ వారు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును అంగీకరించుదురు గాని భాషలు మాట్లాడడం, స్వస్థతవారిలు వగయిరాలను అంగీకరించరు. పెంతెకోస్తువారు, అసెంబ్లీ ఆఫ్ గాడ్ వారు ఇవన్నీ అంగీకరింతురు. అయితే ఇప్పుడు పరిశుద్ధాత్మ బాప్తిస్మమున్నదా?

యేసుప్రభువు ఆజ్ఞాపించిన సార్వజనిక బాప్తిస్మమునకును, పరిశుద్ధాత్మ బాప్తిస్మమునకును చాలా వ్యత్యాసమున్నది. యేసుప్రభువు ఆజ్ఞాపించిన సార్వజనిక బాప్తిస్మము ఒక ఆజ్ఞ (మత్తయి. 28:18-20). దానికి అందరు లోబడవలసినదే. పరివుద్ధాత్మ బాప్తిస్మము ఒక వాగ్దానము. దానిని అమలుచేయువాడు దేవుడే.

బైబిలు బోధ :

ఒకే ఒక్క బాప్తిస్మము ఇప్పుడున్నది (ఎఫెసీ. 4:5)

అది యేసు ఆజ్ఞాపించిన సార్వజనిక బాప్తిస్మము (మత్తయి. 28:19-20 మరియు రోమా. 6:3-6).

పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన వారి సందర్భములు క్రొత్త నిబంధనలో రెండే రెండున్నవి. అవి అపోస్తలులు (అపో.కా. 2:1-4) మరియు కొర్నేలీ యింటివారు (అపొ.కా. 10:44-48). పరిశుద్ధాత్మను పొందునట్లు అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి.

అన్యులు కూడా యూదులవలెనే దేవునికి అంగీకారయోగ్యులు అని నిరూపించుటకు కొర్నేలీ యింటివారు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి.

పరిశుద్ధాత్మబాప్తిస్మము వలన అపొస్తలులు అద్భుతకార్యములు చేసే శక్తిని పొందిరి (అపొ.కా. 2:12; 5:15; 20:9-10). నేడు కూడ పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందామని చెప్పువారు అపొస్తలులు చేసిన అద్భుతములను చేయగల్గాలి.

మతశాఖల బోధ :

పరిశుద్ధాత్మ బాప్తిస్మము నేటికిని అమలులోయున్నది. పవిత్రహృదయులకు అది ప్రాప్తియగును.

గమనిక :

ప్రభువు యొక్క బోధను విని ఆయన ఆజ్ఞలకు లోబడి బాప్తిస్మము పొందిన వారందరికీ పరిశుద్ధాత్మ అను వరము వాగ్దానము చేయబడినది (అపొ.కా. 2:38; గలతీ. 3:27). అపొ.కా. 2:38లో చెప్పబడిన 'పరిశుద్ధాత్మ అను వరము' వలన ఒకడు అద్భుతములు చేయలేడు. యిది 1కొరింథీ 6:19-20లో చెప్పబడిన మనలో

విశ్వసించు ఆత్మయై యున్నాడు. మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందువారికి అసాధారణమైన భావములు కలుగుతాయని ఎక్కడా చెప్పబడలేదు. అయితే బాప్తిస్మము పొందినపుడు ఒకడు సంతోషించును (అపొ.కా. 8:38-39). అప్పుడు అతడు నిర్మలమైన మనస్సాక్షి కలిగియుండును (1 పేతురు. 3:21). ఆయన నేడు ఎవరికీ పరిశుద్ధాత్మలో బాప్తిస్మమిచ్చుటలేదు. సరిగదా పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఒక వాగ్దానమే గాని ఆజ్ఞ కాదు.నీటి బాప్తిస్మము ఒక యాజ్ఞ. దానికి అందరూ లోబడాలి (మార్కు. 16:16). బాప్తిస్మము పొందవలెనను ఆజ్ఞకు లోబడితే పరిశుద్ధాత్మయను వరమును తప్పక పొందుదుము. ఒక వాగ్దానానికి మనం లోబడ లేము. అపొస్తలులను సర్వసత్యములోనికి నడిపించుటకు అది వాగ్దానము చేయ బడెను (యోహాను 16:13). అయితే నేడు మనలను నడిపించుటకు బైబిలున్నది (2తిమో. 3:16-17).

## అద్భుతరీతిగ మాట్లాడు అన్యభాషలు నేడున్నవా?

బైబిలు బోధ :

పెంతెకోస్తు దినమున అపొస్తులులు అద్భుతరీతిగ అన్యభాషలు మాట్లాడిరి (అపొ,కా. 2:1-4). ఈ శక్తిని అపొస్తులులు యితరులపై చేతులుంచి వారికి అందియ్యగలిగియుండిరి (అపొ,కా. 8:5-15 ; 8:18).

అయితే అపొస్తులులు కానివారు ఈశక్తిని యితరులకు సరఫరా చేయలేకపోయిరి (అపొ.కా. 8:5-15). గనుక తమనుండి వేరొకనికి అందించే శక్తి అపొస్తులులకు మాత్రమే పరిమితము చేయబడెను.

సంపూర్ణనియమమైన క్రొత్త నిబంధన లిఖించుట ముగియుసరికి అన్య భాషలు, అద్భుతములు వగయిరా అన్నీ ఆగిపోయెను (1కొరింథీ. 13:8-10; యాకోబు 1:25).

మతశాఖల బోధ :

పెంతెకోస్తు పండుగనాడు అపొస్తులులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొంది, ఎట్లు వివిధ అద్భుతవరములు పొందిరో అట్లే నేడు తాము పొందుచున్నామని పెంతెకోస్తు శాఖలవారు చెప్పుకొందురు.

గమనిక :

అన్యభాషలు మాట్లాడుట ఎంత ప్రాముఖ్యము? అపొ. పౌలు ఇట్లనుచున్నాడు : "అయినను సంఘములో భాషతో పదివేల మాటలు పలుకుటకంటే ఇతరులకు బోధ కలుగునట్లు నా మనస్సుతో అయిదు మాటలు పలుకుట మేలు" (1 కొరింథీ. 14:19).

అన్యభాషలు మాట్లాడుట వలన ఎవరైనా రక్షింపబడుదురా? రక్షింపబడాలంటే అన్యభాషలు మాట్లాడాలా? అక్కర్లేదు గదా! అన్యభాషలలో మాట్లాడే ప్రయోజనం ఎప్పుడో ముగిసిపోయింది (1కొరింథీ. 14:22). అవి విశ్వాసులకు కాదు. అవిశ్వాసులకే సూచకమై యున్నది.

మొదటి శతాబ్దములో పరిశుద్ధాత్మతో నిండిన అపొస్తులులలో దేవుని వాక్యము నివసించేది. అవప్పటికింకా క్రొత్తనిబంధన వ్రాయబడని కాలమది. అయితే పరిశుద్ధాత్మ వరము వలన అపొస్తులులు ఆవాక్యాన్ని గ్రంధస్థము చేయగానే యిక అద్భుతరీతిగా వారి వాక్యాన్ని దృఢపర్చవలసిన అవసరం లేకపోయింది. లిఖించ బడిన క్రొత్తనిబంధన వలన మనుష్యులు ఇప్పుడు నడిపింపబడగలరు. యిక అద్భుతముల ప్రయోజనం లేదు. అయితే, అద్భుతరీత్యా నేడు స్వస్థపరచ గలరా? ఈ శక్తి తమకున్నదని చెప్పుకునేవారు, అపొస్తులులు మొదటి శతాబ్దంలో ఏమేమిచేసిరో వాటినే చేయగలగాలి. మార్కు 16:14-18 లో అన్యభాషలు మాట్లాడిన వారు, స్వస్థతవరము గలవారు పాములను ఎత్తిపట్టుకొందురు, మరణకర మైనది ఏదైనా త్రాగగలరు అని చెప్పబడినది. అయితే, నేడు మొదటి రెండు

పనులుచేసి ఆతరువాత రెంటినీ చేయలేకపోవడం ఆశ్చర్యము కాదా ? అయితే అద్భుతరీత్యా స్వస్థపర్చడం వగయిరా అన్నీ క్రొత్త నిబందన వాక్యమును స్థిర పరుచుట కొరకే (మార్కు 16:20). దేవుని వాక్యమైన బైబిలు దానికదే యిప్పుడు గొప్ప సాక్షియైయున్నది.

మతశాఖలవారు మృతులకొరకైన బాప్తిస్మమును, మరణం ఒక శాశ్వత అంతమని (annihilation) మరణించిన తరువాత కూడా రెండో తరుణం ఉన్నదని రకరాల అబద్ధసిద్ధాంతాలు ప్రవేశపెట్టారు. ఇవన్నీ బైబిలు వెలుగులో మటుమాయమై పోతాయి. ఈ అబద్ధసిద్ధాంతాలన్నింటినీ అన్ని మతశాఖలవారు బోధించరు. కొందరు కొన్నిటిని, మరికొందరు ఇంకా కొన్నిటిని బోధించుదురు. వారు ప్రవేశపెట్టే అబద్ధబోధలన్నిటిని ఈ సంచికలలో మనం చూడలేదు కూడాను.

అయితే వీటన్నిటి వలన మనకొక ప్రశ్న ఉద్భవించకతప్పదు. నేడు రకరాకాల మతశాఖలు ఎందుకున్నాయి? అందరికీ వున్న దేవుడు ఒక్కడే? క్రీస్తూ ఒక్కడే? బైబిలు కూడా ఒక్కటే కదా? అయితే యిన్ని విభిన్న బోధలెందుకు? వీటి ప్రయోజనం ఏమిటి? వచ్చే సంచికలలో తెలుసుకొందాము.

## క్రొత్త నిబంధన సంఘము
### (The New Testament Church)

"సంఘము" అను పదం క్రొత్త నిబంధనలో 112 సార్లు కనబడుచున్నది. ఈ పదం రెండు భావాలతో వ్రాయబడినది. 'స్థానిక సంఘము' మరియు 'సార్వత్రిక సంఘము' అను భావాలతో చెప్పబడినది. 'అంతియొకయలో నున్న సంఘము' (అపొ.కా. 13:1) అను మాట స్థానిక సంఘాన్ని గూర్చి చెప్పబడినది. "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు (కొలస్స. 1:18) అను వాక్యములో సార్వత్రిక భావము కనబడుచున్నది.

ప్రపంచంలో చాలా మతశాఖలున్నాయి. అవి కూడా కొన్ని స్థానికసంఘాల సముదాయాలే. ప్రతీ మతశాఖ అది క్రీస్తుకు సంబంధించినదని, ఒకే సంఘములో అది భాగమని వారు చెప్పుకొనుచున్నారు. ఒక మానవసంస్థను (Organisation) సంఘమని పిలువలేము. మతశాఖల క్రైస్తవ్యము బైబిలు సంబంధమైనది కాదు. బైబిలునకు దూరమైనది.

జర్మనీ దేశములో మార్టిన్ లూథర్ ఉద్యమం తరువాత మతశాఖలన్నీ పుట్టుకొనివచ్చాయి. క్రీస్తు శకము 1500 సంవతత్సరము తరువాత కేథలిక్కు సంఘము, అది బోధించు సంగతులు బైబిలునకు విరుద్ధమైనవని మార్టిన్ లూథర్ వాటిని బహిరంగముగా వ్యతిరేకించెను. ఆ తరువాత అనేక మతశాఖలు పుట్టు కొచ్చాయి. ఇంకా అనేక మతశాఖలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. క్రొత్త నిబంధన 2000 సంవత్సరాలకు మునుపే స్థిరపరచబడి చట్టమైయుండగా సుమారు 500 సంవత్సరాలనుండి అవతరించిన ఈ మత శాఖలు క్రీస్తు సంఘము యొక్క భాగములు ఎట్లు కాగలవు ? క్రొత్త నిబంధన ఏసంఘమును గూర్చి బోధించిందో ఆసంఘములోనే నేను సభ్యుడనైయుండాలని నేను కోరుకొనుచున్నాను.

క్రొత్త నిబంధన సంఘములో నేను సభ్యుడనై యుండాలని కోరుకుంటే, వారు మొదటి శతాబ్దములో ఎట్లు విధేయులయ్యారో అలాగే నేనును విధేయుడను కావల్సియున్నది. వారెట్టి ఆజ్ఞలకు విధేయులయ్యారో నేనును ఆయాజ్ఞలకు విధేయుడనై యుండాలి. క్రీస్తుయేసును విశ్వసించాలని వారు ఆజ్ఞాపించబడిరి (హెబ్రీ. 11:6; యోహాను 8:24). వారు మారుమనస్సు పొందాలి (అపొ.కా. 2:38; లూకా. 13:1-5). ఇతరుల యెదుట క్రీస్తును గూర్చిన విశ్వాసమును వారు నోటితో ఒప్పుకొనాలి (మత్తయి. 10:32-33; రోమా. 10:9-10; అ.కా. 8:37). తరువాత వారు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందాలి (అ.కా.2:38; 22:16). క్రైస్తవులైన తరువాత క్రొత్త నిబంధనలో వ్రాయబడిన బోధయందు నిలకడగా వుండాలి.

క్రొత్త నిబంధన సువార్తకు లోబడి నేను క్రీస్తు సంఘసభ్యుడనైతిని. నేను ఒక మతశాఖ సభ్యుడను కాలేదు. ఎందుచేతనంటే మతశాఖ భావంతో గల క్రైస్తవ్యము బైబిలునకు విరుద్ధమయినదియే గాక దేవుని సంతోషపరచేది కాదు. "క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు, ఆబోధయందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు" (2 యోహాను. 9). మానవ నిర్మితమైన సంఘములలో గాక క్రీస్తు స్థాపించిన సంఘములో సభ్యులమైయుందాం.

- రానీ లోవె **(IGT)**

# క్రీస్తు శిష్యుడు
## (A Disciple of Christ)

నీవు యేసుక్రీస్తు శిష్యుడవా ? శిష్యుడు వెంబడించేవాడు, నేర్చుకొనేవాడు, గురువును అంటియుండువాడు. వివిధ మతాల గురువులకు శిష్యులున్నారు. అయితే నీవు సజీవుడైన దేవుని కుమారుడగు క్రీస్తు శిష్యుడవా ? లూకా సువార్త 14వ అధ్యాయములో ఆయన శిష్యుల నుండి యేసు ఏమి కోరుచున్నాడో ఆయన విపులముగా తెలియజేయుచున్నాడు.

### యేసు సాటిలేని భక్తిని కోరుచున్నాడు

"ఎవడైనను నాయొద్దకు వచ్చి తన తండ్రిని తల్లిని భార్యను పిల్లలను అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు" (లూకా 14:26). ద్వేషించాలా ? యేసు శిష్యులుగా యుండాలంటే నిజంగా మన కుటుంబాలను, మిత్రులను ద్వేషించాలా ? అట్లు కాదు. ఎందువలనంటే మన పొరుగువారిని, శత్రువులను కూడ మనం ప్రేమించాలని యేసు చెప్పాడు గదా. అయితే మనం ఆయనకంటే మరి దేనిని

ఎక్కువ ప్రేమించరాదని ఆయన భావం. యేసుతో మనకున్న సంబంధానికి మధ్య ఇంకో సంబంధాన్ని ఇరికిస్తే అప్పుడు ఆయన శిష్యులము కానేరము. మనం నిరంతరము ఆయన రాజ్యాన్ని నీతిని వెదకాలి (మత్త 6:33).

## యేసు అంతులేని సమర్పణను కోరుచున్నాడు

"మరియు ఎవడైనను తన సిలువను మోసికొని నన్ను వెంబడింపని యెడల వాడు నా శిష్యుడు కానేరడు" (లూకా 14:27). యేసును చంపడానికి ఆయన శత్రువులు సిలువనుపయోగించారు. మన పాపముల ప్రాయశ్చిత్తార్థమై యేసు తన ప్రాణము బెడుతు ఆయన సిలువను సహించాడు. సిలువ మరణమునకు గుర్తు. మనం అహంభావానికి, పాపానికి మరణించాలి; క్రీస్తు కొరకు జీవించాలి. పౌలు ఇట్లనుచున్నాడు: "నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడియున్నాను; ఇకను జీవించువాడను నేను కాను; క్రీస్తే నాయందు జీవించుచున్నాడు" (గలతీ 2:20). మనము మరణము సంభవించినను, లేక మరణించు వరకును క్రీస్తు సిలువను మోయుచు యుండాలి (ప్రకటన 2:10).

లూకా 14:28-32లో యేసుప్రభువు భవిష్యత్తును ఆలోచిస్తూ శిష్యత్వపు మూల్యమును యోచించాలని చెప్పాడు. మనలను ఆయన గోపురమును నిర్మించు వానితోను, లేక యుద్ధమునకు పోవు రాజుతోను పోల్చుచున్నాడు. విధేయతను నిరుత్సాహ పర్చడానికి ఆయన ఈ సంగతులు చెప్పలేదు. సరిగదా ఆయనకు శిష్యులుగా యుండుటలో ఇమిడియున్న సంగతులను నిష్కపటముగా యోచించాలని ఆయన కోరుచున్నాడు. నమ్మకముగా యున్న శిష్యులకు ఆయన యిచ్చే దీవెనలను కూడ మనం గ్రహించాలని కోరుచున్నాడు. అవి పాపములనుండి క్షమాపణ, జ్ఞానమునకు మించిన సమాధానము, నిత్యజీవము మొదలైనవి (అపొ.కా. 2:38; ఫిలిప్పీ 4:7-11; యోహా 14:1-3).

# మనం సమస్తమును విసర్జించాలని యేసు కోరుచున్నాడు

"ఆ ప్రకారమే మీలో తనకు కలిగినదంతయు విడిచి పెట్టనివాడు, నా శిష్యుడు కానేరడు" (లూకా 14:33). నీకు కలిగినదంతయు అమ్మి వేయాలని గాని, అందరకు పంచిపెట్టేయాలని గాని ఈ వచనం చెప్పుటలేదు. అయితే నీకు కలిగిన యావత్తును విసర్జించాలని అది చెప్పుచున్నది. నీవు సువార్తకు లోబడి నప్పుడు నీ జీవితాన్ని దానిలోని సమస్తమును క్రీస్తుకు అప్పగిస్తావు. నీవు క్రీస్తు శిష్యునిగా యుంటూ నీ ఆస్థిని, సంపదను, ప్రజలను స్వార్థపరునివలె కలిగి యుండలేవు. మనకు కలిగినదంతయు మన దేహములతో సహా దేవుని మహిమ కొరకు వినియోగించాలి. కొరింథులోని క్రైస్తవులకు పౌలు ఇట్లు జ్ఞాపకం చేసాడు: "మీ దేహము దేవునివలన మీకు అనుగ్రహింపబడి, మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా ? మీరు మీ సొత్తుకారు, విలువ పెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి" (1కొరింథీ 6:19-20).

యేసుప్రభువు తన శిష్యులందరి నుండి సాటిలేని భక్తిని, అంతులేని సమర్పణ జీవితమును, ఇహలోక సంగతుల విసర్జనను కోరుచున్నాడు. మరియు ఆయన శిష్యులు ఇతరులను కూడ శిష్యులుగా చేయాలని కోరుచున్నాడు. ఆయన ఇట్లనుచున్నాడు : "కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామము లోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి, ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నాను" (మత్తయి 28:19-20). నీవు క్రీస్తు శిష్యుడవా?

- మార్క్ బైర్డ్.

# క్రీస్తు శిష్యుడగుట ఎట్లు ?
## (How to become a Disciple of Christ)

1. క్రీస్తు సువార్త వినాలి: రోమా 10:14-17; అపో.కా. 15:7; లూకా 8:12-18.
2. దేవునియందును, ఆయన కుమారుడైన క్రీస్తునందును విశ్వాసముంచాలి: యోహా 3:16; 8:24; అపో.కా. 16:31-34; రోమా 10:9-10; హెబ్రీ 11:1,6.
3. క్రీస్తునందలి నీ విశ్వాసమును ఒప్పుకొనాలి : మత్తయి 10:32,33; అపో.కా. 8:37; రోమా 10:9-10.
4. పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందాలి : మార్కు 16:16; యోహాను 3:3-5; అపో.కా. 2:38.

ఒకడు పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందగా, రక్షింపబడినవాడై దేవుని బిడ్డయగును, అతడు క్రీస్తు సంఘముతో ప్రభువుచే చేర్చబడును (అపో.కా. 2:47), క్రీస్తు శిష్యుడు, క్రైస్తవుడగును (అపో.కా. 11:26).


ఉచితం! ఉచితం! ఉచితం!

మీ ఇంటనే ఉండి బైబిలును చదవండి.
యేసుక్రీస్తును ఆయన బోధనలను తెలుసుకోండి.
మేమిచ్చు ఉచిత బేసిక్ బైబిలు కోర్సులో చేరండి.
పోస్టుద్వారా ఆ పాఠములను పూర్తిచేసి
ఒక బైబిలును ఉచితముగా పొందండి

SATYA VANI, P.O. Box 80, KAKINADA - 533 001. A.P.

నిర్మించుకోవాలని ఆయన హెచ్చరికచేసారు. అటు తరువాత రేండల్ హేగ్వుడ్‌గారు మార్కుసువార్త 2వ అధ్యాయంలో చెప్పబడిన నలుగురు విశ్వాసులను గూర్చి మంచిపాఠమును ఉపదేశించిరి. వారు పక్షవాయువుతో బాధపడుచున్న ఒక రోగిని యేసు ఉపదేశించుచున్నచోటికి పైగా ఇంటికప్పు విప్పి, సందుచేసి పక్షవాయువుగలవానిని పరుపుతోనే దింపిరి. యేసు వానిని స్వస్థపరచెను. ఆరోగిని క్రీస్తునొద్దకు తెచ్చిన నలుగురు విశ్వాసులను గూర్చి హేగ్వుడ్‌గారు చక్కగా ఉపదేశించిరి.

సోదరులు టి.వి.యన్. కుమార్‌గారు 1దిన. వృ. 28:8,9 పై ఆధారపడి మనము దేవుని ఆజ్ఞలు ఎట్టివో తెలిసికొని, వాటిని గైకొనాలని, మన దేవుని మనము తెలిసికోవాలని, హృదయపూర్వకముగాను, మనఃపూర్వకముగాను ఆయనను సేవించాలని, ఆయనను వెదకాలని హెచ్చరించిరి. అటుతరువాత సోదరులు జి. షడ్రక్ (పాలకొల్లు) గారు వాక్యపరిచర్యచేయగా ఉదయకాలపు కూటము ముగిసెను.

మధ్యాహ్నకాలకూటములో సోదరులు ఆర్. సమూయేలు, సి.హెచ్. యేసుదాసు, యన్. రవికుమార్ గార్లు పాటలు నడిపించిరి. సోదరులు యి. అబ్రహామ్ గారు(తిమ్మాపురం) ప్రార్థనచేయగా అమెరికా సోదరులిరువురు మరల వాక్యోపదేశము చేసిరి. సోదరులు కుమార్, సాల్మన్‌రాజు మరియు జాషువాగార్లు తెలుగునకను వదించిరి. సోదరులు కుసుమ ప్రసాద్ (ఆచంట) గారి ప్రార్థనతో సదస్సు ముగిసెను.

2000 సెప్టెంబరు 23వ తేదీ శనివారం తూర్పుగోదావరి జిల్లా రాయవరం గ్రామములో నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయమును సోదరులు హర్షల్ బియర్డెన్ గారు, జాషువాగూటంగారు రిబ్బను కత్తిరించి ప్రభువు సేవకొరకు ప్రతిష్టించిరి. కందరాడవలెనే రాయవరంలో కూడ సోదరులు రోయస్‌ఫ్రెడరిక్ గారి ప్రోత్సాహముతో స్థానికసంఘస్థుల సహకారముతో జాషువా గారు ఈఆలయమును నిర్మించిరి. రాయవరంలో నూతన ఆలయ ప్రతిష్టను పురస్కరించుకొని స్థానికసంఘము మూడు దినముల సువార్త కూటములు నిర్వహించిరి. మొదటిదినం ఉదయకాల కూటములో సోదరులు హర్షల్‌గారు చక్కటి వాక్యోపదేశము గావించిరి. క్రీస్తులో యున్న ప్రతివారు పెరగాలని, ఆత్మీయంగా బలపడాలని వారు హెచ్చరించిరి.

స్థానిక సువార్తికులు టి. నతానియేలుగారు సువార్త కూటమునకు, ఆలయ ప్రతిష్టకు వచ్చినవారిని అభినందించిరి. నూతన ఆలయ నిర్మాణ విషయంలో దేవుడు చేసిన మేళ్ళను గూర్చి ఆయన వివరించి జాషువా గారికి, రోయస్ ఫ్రెడరిక్ గారికి కృతజ్ఞతలు తెలియజేసిరి. వచ్చిన వందలాది ప్రజలకు చక్కటి భోజనపానాదుల నేర్పరచిరి. రాయవరంలోను, పరిసరప్రాంతములోను జరుగుచున్న సేవాభివృద్ధి కొరకు అందరూ ప్రార్థించుదాం.

సెప్టెంబరు 25నాడు హర్షల్‌గారు, రేండల్‌గారు వానపల్లి, పలివెల గ్రామములలోను, 26నాడు ఉప్పలగుప్తం, బడుగువారిపేట, ఆదిలక్ష్మిపేటలోను సువార్త కూటములు నిర్వహించిరి. సెప్టెంబరు 27వ తేదీ నాడు జాషువాగూటం గారు రేడియో ప్రసంగములు రికార్డు చేయు నిమిత్తం ఢిల్లీకి బయలుదేరి వెళ్ళిరి. ■

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/99

From :
**SATYA VAKKU**
P.O. BOX 80,
KAKINADA - 533 001

TO

*Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani - Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : Joshua Gootam.*